క్లుప్తంగా

నేడు అనఘా వ్రతం

సనత్‌నగర్: జ్యేష్ఠ మాసం బహుళ అష్టమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం అనఘా వ్రతం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొనాలన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు వెస్ట్ మారేడ్‌పల్లిలోని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జరిగే ఈ సమావేశానికి కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని మంత్రి కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

బన్సీలాల్‌పేట్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ నెల 11 ఆదివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో పర్యటిస్తారని స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బైబిల్ హౌస్ రైల్వే ట్రాక్ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటిస్తారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.35, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 50, దొండ 23, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 85, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 38, మొరంగడ్డ 18, కందగడ్డ 40, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

భట్టియాత్రకు ఓయూలో సంబురాలు



ఉస్మానియా యూనివర్సిటీ: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ యాత్ర వేయి కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓయూలో సంబరాలు జరిపారు. శనివారం విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు లోకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట బాణాసంచా కాల్చి, కేక్‌కట్ చేశారు. అనంతరం భట్టియాత్రకు సంఘీభావంగా దేవరకొండకు బస్సుయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో చనగాని దయాకర్, విజయ్‌కుమార్, శ్రీహరి, దుర్గం భాస్కర్, శ్రీనివాస్, రాంచంద్రయ్యాయాదవ్, రాథోడ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో అన్నదానం



అమీర్‌పేట: రాయల సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ తెలిపారు.ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, సహాయకులకు శనివారం భోజనాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా నిరుపేద ప్రజలు వస్తుంటారని దీంతో సంస్థ ప్రతినిధుల సహకారంతో ప్రతి నెల ఒక్కో ఆసుపత్రిని ఎంచుకుని 300 మందికి భోజనాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

సమష్టి కృషితోనే శాంతి భద్రతల పరిరక్షణ

కాచిగూడ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా వ్యవహరించి నేరాల నియంత్రణకు సహకారం అందించాలని కాచిగూడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు అన్నారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న 32 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను అభినందించి శనివారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర కీలకమని సమాజంలో ప్రతి ఒక్కరితో మంచిగా ఉంటూ శాంతి భద్రతలను పోలీసులు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే వారితో పనిఒత్తిడి ఉన్నప్పటికీ మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. అడ్మిన్ ఎస్సై హెచ్.నరేష్, సురేష్ తదితరులున్నారు.

అసంపూర్తి పనులు.. అవస్థలో ప్రజలు



అంబర్‌నగర్ గాంధీ విగ్రహం సమీపంలో రోడ్డు వేయకుండా వదిలేసిన దృశ్యం

- రాకపోకలకు తలెత్తుతున్న ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

బౌద్ధనగర్: అధికారుల అనాలోచిత పనుల కారణంగా స్థానికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. బౌద్ధనగర్ డివిజన్ అంబర్‌నగర్ గాంధీ విగ్రహం సమీపంలోని అపోలో స్కూల్ లేన్‌లో నూతన రోడ్డు వేసేందుకు గత నెల రోజుల క్రితం మంచిగా ఉన్న రోడ్డును తవ్వారు. అనంతరం పనులు చేయకుండా అలాగే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో ఆ మార్గాన నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, వికలాంగులైతే ఆ రోడ్డు మార్గాన నడవలేక నరకం అనుభవిస్తున్నారు. కిందపడిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. రోడ్డు నిర్మాణ పనులు తొందరగా ప్రారంభించాలని సంబంధిత అధికారులను సంప్రదించినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు...

అంబర్‌నగర్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో మూడు పాఠశాలు ఉన్నాయి. ఈ రోడ్డు మార్గం పూర్తిగా అధ్వానంగా ఉండడంతో సోమవారం నుంచి ప్రారంభం కానున్న స్కూళ్లకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. స్కూళ్లకు ఆటోలు, ఇతర వాహనాలపై వచ్చే వారు సైతం ఇబ్బందులు పడవ తప్పదు. అసంపూర్తిగా ఉన్న ఈ రోడ్డుపై విద్యార్థులు ప్రమాదాలకు గురవుతారని ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించిన నూతన రోడ్డు పనులను ప్రారంభించాలని కోరుతున్నారు.

వెంటనే పనులు ప్రారంభిస్తాం..

అంబర్‌నగర్‌లో నూతన రోడ్డు వేసేందుకు నెల రోజుల క్రితం రోడ్డును తవ్విన విషయం వాస్తవమే. కానీ.. డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కారణంగా కొంత ఆలస్యం జరిగింది. నూతన రోడ్డు వేసిన తర్వాత డ్రైనేజీ పైప్‌లైన్ రిపేర్ వస్తే మళ్లీ రోడ్డు తవ్వాల్సి వస్తుంది అందుకే బస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కారణంగానే నూతన రోడ్డు వేయడంలో ఆలస్యం జరిగింది. వెంటనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అధికారులను ఆదేశించాము. వీలైనంత తొందరగా పనులు పూర్తిచేసి రోడ్డును అందుబాటులోకి తీసుకొస్తాం. –కంది శైలజ, కార్పొరేటర్

అభివృద్ధిలో సికింద్రాబాద్ అగ్రస్థానం

డిప్యూటీ స్పీకర్ పద్మారావు



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న పద్మారావు గౌడ్

చిలకలగూడ: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో సికింద్రాబాద్ నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. గతేడాది కాలంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి ద్వారా రూ.73 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మాణికేశ్వరీనగర్, చిలకలగూడ ఆర్‌యుబీ నిర్మాణానికి రూ. 50 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లైన్‌బజార్ మసీదు వద్ద రూ.6 లక్షలు, మైలార్‌గడ్డ రూ.6.18 లక్షల వ్యయంతో సివరేజీ పైప్‌లైన్ పనులు, జోషికాంపౌండ్‌లో రూ.6.5 లక్షలతో పవర్‌బోరింగ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, కందిశైలజ, జలమండలి డీజీఎం కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు కిషోర్‌కుమార్, రాజుసుందర్, గౌడ్ శ్రీను, వంజరి సతీష్, నవీన్‌కుమార్, రవి, జగదీష్, గౌష్‌భాయ్ పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేద్దాం



క్రాంతికుమార్, శ్రీనివాస్‌ను సన్మానించిన శ్యాంసుందర్‌గౌడ్

సనత్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల అధ్యక్షులుగా కన్నూరి క్రాంతికుమార్, నక్క శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శ్యాంసుందర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి గడప గడపకు వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు.

‘ప్రజాగర్జన’ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బౌద్ధనగర్: వివేకానంద ఆటో స్టాండ్ వద్ద శనివారం సీపీఐ ప్రజాగర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎండీ ఉమర్ ఖాన్ మాట్లాడుతూ.. బీజేపీ హటావో దేశ్‌కో బచావో కార్యక్రమంలో భాగంగా పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం ముగింపు సభ ఈ నెల 11న కొత్తగూడెంలో జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మోటార్ రంగ కార్మికులకు సంక్షేమం బోర్డు ఏర్పాటు చేయాలని, ఇల్లు లేని ప్రతీ డ్రైవర్ కుటుంబానికి డబుల్ బెడ్రూమ్ మంజూరు చేయాలన్నారు. అదే విధంగా ఓలా, ఊబర్ రద్దు చేసి ప్రైవేటు ఫైనాన్సర్ల దోపిడీ నుంచి మోటార్ రంగ కార్మికులను రక్షించాలని కోరారు. నిరుపేద ప్రజలకు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ప్రజా గర్జనకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెర్రిపోతుల కుమార్, షేక్ లతీఫ్, ఎస్. లక్ష్మణ్, సంపత్, నరసింహ, మల్లేష్, కృష్ణ, వీరస్వామి, కొమురయ్య, శంకర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బన్సీలాల్‌పేట్: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు కథనం ప్రకారం...సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదురుగా బోయిగూడ మెట్రోరైల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు వయస్సు 45– 50 ఉంటుందని ముఖంపై గాయాలు ఉన్నాయని మృతుడు ఎవరూ ఇక్కడి ఎందుకు వచ్చాడు.. మెట్రో దిగుతూ మెట్లపై నుంచి కిందికి జారీ ముఖంపై గాయాలు కావచ్చని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ గురుమూర్తినగర్‌లోని వినాయక స్వామి దేవాలయంలో నవనాగుల యంత్ర, విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శనివారం ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నవనాగుల పంచామృతాభిషేకములు, ప్రతిష్ఠా దేవతల యొక్క శాంతి పూర్వక హవనం, పూర్ణాహుతి నీరాజన మంత్ర, వేద ఆశీర్వచన పూజలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.నరేందర్‌రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పూజలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్‌ఎస్ నాయకులు కూతురు నర్సింహ, కట్ట బల్‌రాం, షాబాద్ సత్యనారాయణ, కనకదుర్గా దేవి ఆలయ సూపరింటెండెంట్ రంగారెడ్డి పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సాయికృష్ణ

అమీర్‌పేట: హాస్టల్‌లో ఉంటున్న ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై జీవానందం వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందిన సాయికృష్ణ (22) ఎస్ఆర్‌నగర్‌లోని ఓ సంస్థలో పనిచేస్తూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 6వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. ఆచూకీ కోసం పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో సోదరుడు శివ కల్యాణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయికృష్ణతో పాటు పనిచేసే ఓ సహోద్యోగితో విభేదాలున్నాయని, సాయికృష్ణ అదృశ్యం వెనుక ఆతని హస్తం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఇంద్రజాలం.. మంత్రముగ్ధం



మెజీషియన్లతో హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ రాధారాణి





రాంగోపాల్‌పేట్: ఛూ మంతర్.. ఛూఛూ మంతర్ అంటూ తమ అద్భుతమైన ఇంద్రజాలంతో ప్రేక్షకులను మైమరిపించారు. గాల్లో నుంచి గొడుగులు, కళ్లు మూసి తెరిచే లోపు చేతుల్లో రంగురంగుల కర్రలు, ఆకర్షణీయ బట్టలు.. అద్దాల బాక్సులో యువతిని బంధించి కత్తులతో గుచ్చి క్షణాల్లో అందులో నుంచి మాయం చేసి మరొకరు ప్రత్యక్షం చేసి వావ్ అనిపించారు. శ్రీలంక, సౌత్ కొరియా, ఫిలిప్పియన్, మలేషియా ఇండియాలోని తెలంగాణ, ఆంధ్ర, కేరళ తదితర రాష్ట్రాలకు చెందిన మెజీషియన్స్ హాజరై ప్రేక్షకులను మంత్ర ముగ్దుల్ని చేశారు. మెజీషియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో రెండు రోజుల పాటు ఛూ మంతర్–2023 పేరుతో నిర్వహించే మ్యాజిక్ షో శనివారం ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ మెజీషియన్స్ బీఎస్ రెడ్డి జగ్లర్ కిషన్, గోపాల్‌రెడ్డి సౌత్ కొరియాకు చెందిన ఆడ్విన్ తదితరుల మ్యాజిక్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు జడ్జి డాక్టర్ రాధారాణి, వాటర్ బోర్డు చైర్మన్ ప్రకాష్, పద్మశ్రీ డాక్టర్ హన్మంతరావు హాజరయ్యారు.

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించండి



సమస్యలను అధికారులకు ఫోన్‌లో వివరిస్తున్న గజ్జెల నాగేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరిస్తానని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ పేర్కొన్నారు. శనివారం ఏడో వార్డు నెహ్రూ సెంటినరీ కాలనీలో నాగేష్ పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలోని ప్రధాన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ కుంగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని మురుగునీరు మ్యాన్‌హోళ్ల ద్వారా బస్తీ, రోడ్లపైకి చేరుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే బోర్డు ఇంజినీరింగ్ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించిన గజ్జెల నాగేష్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట రావుల సతీష్, నవీన్, జంగిలి రాజు, నగేష్ యాదవ్, శ్రీనివాస్ ఉన్నారు.

పాఠశాల సందర్శన



పాఠశాలను సందర్శించిన మర్రి రాజశేఖర్ రెడ్డి

రసూల్‌పురా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు షేక్ నయీం ఆధ్వర్యంలో 2వ వార్డు రసూల్‌పురా గన్‌బజార్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను శనివారం రాజశేఖర్ రెడ్డి సందర్శించారు. అపరిష్కృతంగా ఉన్న టాయిలెట్ల నిర్మాణం విషయమై పాఠశాల మౌలిక సదుపాయల కల్పన చైర్మన్ శ్రీధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో ఏడు వందలకు పైగా విద్యార్థులు ఉన్నారని వారికి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాల పునః ప్రారంభం కన్నా టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేసి నీటి వసతి కల్పించాలన్నారు. ఆయన వెంట ముప్పిడి మధుకర్, ప్రభుగుప్త, జహీర్, ఇసాక్ జుబేర్, ఆర్బాజ్, కృష్ణ పాల్గొన్నారు.

వైభోగం.. వెంకన్నస్వామి కల్యాణం



చిలకలగూడ : నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్‌దీపాలతో సుందరంగా తీర్చిదిద్ది, ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, భాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కనుల పండువగా నిర్వహించారు. మల్లెపూలు, తులసీ దళాలతో మూలవిరాట్‌కు చేసిన ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరాదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోరిక మేరకు ప్రతి నెల రెండవ శనివారం స్వామివారి కల్యాణోత్సవం జరిపిస్తున్నామని నోముల ప్రకాశరావు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



కల్యాణానికి హాజరైన భక్తులు